క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు గురుమంచి చంద్రశేఖర్ శర్మ, అముల్ పంతులు 108 కలశాలతో అభిషేకం, చండీయాగం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా బస్తా ధర రూ.270 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో కార్యాలయానికి రావాలని సూచించారు.

కేటీఆర్‌ను కలిసిన జాన్సన్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జాన్సన్

ఖానాపూర్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ కలిశారు. పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారి చికిత్సకు సాయం

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామానికి చెందిన నాగిళ్ల లావణ్య–చిరంజీవి దంపతుల కూతురు నిఖితపై ఇటీవల వేడినూనె పడటంతో తీవ్రంగా గాయపడింది. వైద్యం కోసం డబ్బులు లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు రూ.తొమ్మిది వేలను సాయంగా అందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఎడతెరిపిలేని వర్షం



పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

కుంటాల: మండలంలోని గ్రామాల్లో ఐదు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. దీంతో వ్యవసాయ పనులు మందగించాయి. పత్తి, సోయా పంటల్లో వర్షపు నీరు నిలిచింది. చేన్లలో కలుపు మొక్కలు పెరుగుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 21.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

కాల్వల్లో పూడికతీత

బాసర: మండల కేంద్రంలో బుధవారం మురుగుకాల్వల్లో నెలకొన్న చెత్తాచెదారాన్ని పారిశుధ్య సిబ్బంది తొలగించారు. పలు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి క్లోరినేషన్ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు బేటీబచావో– బేటీ పడావో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింగవివక్ష, మహిళలపై దౌర్జన్యం, వరకట్న వేధింపులు, భ్రూణహత్యలు, బాలికల ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, శిలాజ, కౌన్సెలర్లు లావణ్య, లలిత, తదితరులున్నారు.

రోడ్లపైనే పశువులు



బస్టాండ్‌లో గుంపులుగా పశువులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రోడ్లతోపాటు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. రోడ్లపై వచ్చే పశువులతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు, బస్టాండ్‌లోకి పశువులు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

‘బెల్ట్’ తీసేదెవరు..?

- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- టెండర్ల పేరిట రూ.లక్షల్లో వసూలు
- ఆగని వీడీసీ ఆగడాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీస్‌శాఖలు
- బార్లను తలపిస్తున్న పర్మిట్‌రూంలు



బెల్ట్ షాపులో అమ్ముతున్న మద్యం బాటిళ్లు పట్టుకున్న తానూరు ఎస్సై సందీప్, సిబ్బంది (ఫైల్)

తానూరు: మండల వ్యాప్తంగా ఊరికో మద్యం దుకాణం(బెల్ట్ షాపు) వెలుస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం తమకేం పట్టదన్నట్లు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొందరు ప్రజలు పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యం తాగానికే ఖర్చు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లోని చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో యువకులు మద్యానికి బానిసవుతున్నారు.

రూ.లక్షల్లో టెండర్లు ..

ఊర్లలో ఏర్పాటు చేసే బెల్ట్‌షాపులపై గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లు పెత్తనం చెలాయిస్తున్నాయి. మద్యం అమ్ముకోవాలంటే వీడీసీ ఆధ్వర్యంలో ఏడాదికి గాను టెండర్ పాడాల్సిందే. మండలంలో కేవలం తానూరులో మాత్రమే వైన్స్ ఉండగా గ్రామాల్లో వీడీసీ ఆధ్వర్యంలో వేలంపాట ద్వారా బెల్ట్ షాపులను సొంతం చేసుకుని మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. పెద్ద ఊరైతే రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు పలుకుతోంది. టెండర్ దక్కించుకున్న బెల్ట్‌షాపు నిర్వాహకులు వైన్స్‌లో కంటే మద్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముతారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30వరకు.. ప్రతి బీరు సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా అమ్మకాలు సాగిస్తుంటారు. బెల్ట్ షాపులో రోజుకు రూ.వేలల్లో అమ్మకాలు జరుగుతాయి. ఆదివారం, పండుగ వేళల్లో అయితే ఊహించుకోవాల్సిందే. మండలంలో 36 గ్రామాలుండగా.. కేవలం ఐదారు గ్రామాలు మినహా అన్నిచోట్ల టెండర్ల ద్వారా మద్యం అమ్ముతారు. ఏకకాలంలో సరుకు అమ్ముడవుతుందని వైన్స్‌షాపుల నిర్వాహకులు సైతం.. బెల్టుషాపుల యజమానులకు ముందస్తుగా రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు సరుకు అందిస్తారనే విమర్శలున్నాయి. టైంతో పని లేకుండా ఏడాదిలో ఎప్పుడైనా బెల్ట్‌షాపు డోర్ కొడితే చాలు మద్యం ఇచ్చేస్తున్నారు.

మద్యం దుకాణాల్లోనే పర్మిట్ రూంలు..

బార్లు, వైన్స్‌ల్లో నిర్ణీత వేళల్లోనే మద్యం దొరుకుతుండగా బెల్ట్‌షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటుంది. మరోవైపు బార్ల మాదిరి బెల్ట్ షాపుల్లో అక్రమంగా సిట్టింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తూ.. వాటిల్లో ఆహార పదార్థాలను ఉంచి మందుబాబులను ఆకట్టుకుంటున్నారు. ఇదంతా తమకు తెలిసే జరుగుతున్నా.. ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో ఉంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో స్థానిక పోలీసులు తూతూమంత్రంగా బెల్ట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందిచి బెల్ట్‌షాపుల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

రూ.లక్ష కొట్టు ‘బెల్టు’ పట్టు ..

తానూరు మండలంలోని బెల్‌తరోడా గ్రామం 62 జాతీయ రహదారి సమీపంలో ఉంటుంది. ఈ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో టెండర్ నిర్వహించారు. గ్రామస్తులెవరైనా వీడీసీకి రూ.లక్ష కడితే ఏడాదిపాటు బెల్ట్ షాపు నిర్వహణకు అనుమతిస్తారు. ప్రస్తుతం గ్రామంలో మూడు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం బెల్ట్‌షాపులు రహదారికి దూరం ఉండాలి. కానీ కొందరు నిబంధనలు విస్మరించి రహదారిని ఆనుకొనే బెల్ట్‌షాపులను నడిపిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

తనిఖీలు నిర్వహించి చర్యలు

నిబంధనల ప్రకారం గ్రామాల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు నిర్వహించరాదు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే షయం తమ దృష్టికి రాలేదు. గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– నజీర్‌హుస్సేన్ , ఎక్సైజ్ సీఐ, భైంసా

‘బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం’



కడెంలో మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి



నిర్మల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తరి శంకర్‌తో కలిసి మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతుందని పేర్కొన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు కూడా బడ్జెట్ గురించి మాట్లాడకపోవడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

సోన్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం సరికాదని మండలంలోని మాదాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సింహారెడ్డి అన్నారు. ఆయన గ్రామంలో మాట్లాడారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు మేక ప్రేమ్‌కుమార్, అల్లూరి రాజారెడ్డి, గంగారెడ్డి, నాంపల్లి సతీశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి కూడా తెలంగాణకు నిధులు తేలేదని తాజా మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తాజా మాజీ ఎంపీటీసీ గుజ్జరి గణేశ్, కాంగ్రెస్ నాయకులు ఈటెల శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యారంగానికి మొండిచేయి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపిందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి పది శాతం నిధులు కేటాయించాలని విద్యాకమిషన్లు సూచించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత బడ్జెట్లో విద్యారంగానికి 3.06శాతం నిధులు కేటాయించిందన్నారు. విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయడం సరి కాదన్నారు. దీనిపై ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివచందర్, సాయి, లిఖిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు



నిర్మల్‌లో కేక్ కట్ చేస్తున్న మార్గొండ రాము, బీఆర్‌ఎస్ నాయకులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మారగొండ రాము కేకు కట్ చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు గౌరవ మాజీ సభ్యులు మహమ్మద్ నజీరుద్దీన్, పార్టీ మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుశీల్ కుమార్‌రావు, జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, నాయకులు సయ్యద్‌ఖాజా, అక్రమ్‌అలీ, మహమ్మద్ మసూద్‌ఖాన్, అనిల్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్లజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు రఫీక్ అహ్మద్, బోయిని మంగ, రాముగౌడ్, రంజిత్, గౌసొద్దీన్, గంగన్న, ముబారక్, సతీశ్, కౌసర్, అబ్దుల్లా ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, దాసరికిషన్, దశరథ్, రమాకాంత్, పవార్ రాజు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: కేటీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకముందు స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో కేక్ కట్ చేశారు. నారాయణరావు, బీసీ రాజన్న, రాజగంగన్న, రాజు, శ్రావణ్, మహేందర్, గోపాల్, మల్లేశ్, పెద్దినర్సయ్య, శ్రీకాంత్, వంశీ, మహిపాల్ తదితరులున్నారు.

విద్యార్థికి సన్మానం

తానూరు: మండల కేంద్రానికి చెందిన అమన్ అనే యువకుడు మద్రాస్ ఐఐటీకి ఎంపికవడంతో బుధవారం తానూరులో పలువురు శా లువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవ్‌రావ్ పటేల్, మహేశ్ తదితరులు ఉన్నారు.

బాలకార్మికుల నిర్మూలనకు కృషి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుంటాల: బాలకార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు శ్రీనివాస్, నరేందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్‌లో బాలకార్మికుల నివారణ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దుకాణాలు, హోటల్లో బాలలతో పనులు చేయించొద్దని సూచించారు. వారంతా పాఠశాలలు, కళాశాలల్లోనే ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సలార్, కానిస్టేబుల్ హరీశ్, అనుప్రియ ఉన్నారు.

ఉద్యోగులకు ఘన సన్మానం

దిలావర్‌పూర్: మండలంలో ఐదేళ్లు విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీఓ అజీజ్‌ఖాన్, నలుగురు పంచాయతీ కార్యదర్శులను బుధవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎంపీడీఓ అరుణరాణి, తహసీల్దార్ స్వాతి, ఏపీఓ దివ్యారెడ్డి పాల్గొన్నారు. మండలంలోని కాల్వ, కాల్వతండా, సముందర్‌పల్లి, మాయాపూర్ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కల్యాణి, మేఘన, ప్రీతి, దివ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన అడెల్లు బదిలీపై భైంసా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. బుధవారం వారిని సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ నరేశ్ గౌడ్, ఆర్ఐ అడెల్లు, విశాల్, మురళి, సాగర, ప్రవీణ్, ఆనంద్, శ్రీనివాస్, ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బిలోలిలో..

లోకేశ్వరం: మండలంలోని బిలోలి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ముత్తన్న, భూమేశ్‌లను వీడీసీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, భూమారావు, ఉపాధ్యాయులు సామ దేవేందర్‌రెడ్డి, రఘునాథ్ పాల్గొన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: తహసీల్దార్ కార్యాలయంలో ఎస్‌టీవోగా విధులు నిర్వహించే సత్యనారాయణకు జగిత్యాలకు బదిలీ అయింది. బుధవారం ఎస్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ మండలాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి, ఎస్.రాజేశ్వర్, ప్రతినిధులు రమేశ్, గంగాధర్, రామాగౌడ్, రాజశేఖర్‌చారి, గంగారావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో రహీం

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఊరూరా మొక్కలు నాటి వనమహోత్సవం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

దిలావర్‌పూర్: నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి..సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహణకు అశ్రద్ధ చూపొద్దన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం దిలావర్‌పూర్ పరిసరాల్లోని దాబాల్లో మద్యం కట్టడికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

సోన్: స్థానిక ఎన్నికల సమరానికి కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్ష లోపు రుణం ఉన్న చాలా మంది రైతులకు మాఫీ కాలేదన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని ఇప్పటికీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, హరీశ్‌రెడ్డి, రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, నరేశ్, గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, రాజనర్సయ్య, గణేశ్, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి



లోకేశ్వరంలోని కేజీబీవీలో భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

లోకేశ్వరం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, బీసీ హాస్టల్‌ను ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ అనసూయ, బీసీ హాస్టల్ వార్డెన్ రాజు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కుంటాల: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీటీ నరేశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్ కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎస్‌వో సువర్ణ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ముధోల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రధాని పిలుపు మేరకు అమ్మ పేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. టి.శ్రీనివాస్, జి.గంగాధర్, రహిమాన్, నారాయణ ఉన్నారు.

సంతాపసభ



నివాళులర్పిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పని చేసిన రాయల చంద్రశేఖర్ ఆశయ సాధనకు పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు ఎస్.గంగన్న అన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్‌లో రాయల చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యలు, భూపోరాటాలు రైతాంగ సమస్యలపై ఢిల్లీలో జరిగిన రైతు పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శంకర్, లక్ష్మీ ,లింగన్న,సాయన్న,ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా చేర్చాలి



మాట్లాడుతున్న ఎస్సై గౌసుద్దీన్

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ప్రమాదరహిత వారోత్సవాలు నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవర్లు బస్సు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. అనంతరం పలువురు ఉత్తమ డ్రైవర్లను అభినందించారు. కార్యక్రమంలో డీఎం హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఉద్యోగులు చందు, భగవంత్ రావు, తదితరులున్నారు.

పేకాటరాయళ్ల అరెస్ట్

కుభీర్: మండలంలోని పల్సి శివారులో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు గ్రామస్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై పి.రవీందర్ పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ. 23,350ను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసిన ట్లు తెలిపారు.

‘బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి’

బాసర: ఆదిలాబాద్‌లో ఓ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్‌ను బెదిరించిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బాసర జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా కమిటీ సభ్యులు మాట్లాడారు. రాజకీయ వార్తలు రాస్తే ఇష్టానుసారం వ్యవహరించడం సరికాదని.. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు.

భైంసాటౌన్:నిజాలను నిర్భయంగా వెలికితీసే జర్నలిస్టులను బెదిరింపులకు గురిచేయడం సరికాదని బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్‌లో ఓ ఛానల్ రిపోర్టర్‌ను కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రావుల పోశెట్టి, ముల్లావార్ అనిల్, రాజన్న, కుంట రవి ఉన్నారు.